క్లుప్తంగా

భానులింగేశ్వరుని హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్‌: స్థానిక భానుగుడి సమీపంలోని భానులింగేశ్వరస్వామి ఆలయంలో హుండీలను గురువారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. ఐదు నెలల కాలానికి రూ.2.26 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ ఎం.వీరభద్రరావు తెలిపారు. ఈ హుండీలు లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారుల వడ్డి ఫణీంద్రకుమార్ సమక్షంలో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు పరామర్శ



ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వరరావును పలకరిస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: విజయరాయుడుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నున్న వెంకటేశ్వరరావును మండల వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలై ఒకకాలును తొలగించడంతో, కాకినాడలోని బంధువుల ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, కాదా వెంకటేశ్వరరావు, వాసంశెట్టి రామారావు, సాదే లోహిదాస్‌కుమార్, వనుం భాస్కరరావు తదితరులు పలకరించినవారిలో ఉన్నారు.

ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు

కాకినాడ కల్చరల్‌: స్థానిక శాంతినగర్‌లోని రామచంద్రమిషన్ ఆడిటోరియంలో ఆర్ట్‌ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్, మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మిషన్ కో–ఆర్డినేటర్ కె.మూర్తి తెలిపారు. యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు హాజరు కావాలని కోరారు.

కార్పొరేషన్ వద్ద కార్మికుల ధర్నా

కాకినాడ: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం సీఐటీయూ నగర అధ్యక్షుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పలివెల వీరబాబు, జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మేడిశెట్టి వెంకట రమణ తదితరులు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు, కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

వచ్చే నెల 9న మహాధర్నా

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9 విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కాకినాడ టీచర్స్ హోంలో నిర్వహించిన కేంద్ర కార్మిక సంఘాల జిల్లా సదస్సులో పలువురు నాయకులు మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు చంద్రమళ్ల పద్మ, తోకల ప్రసాద్, రాజారావు, కృష్ణార్జున పాల్గొన్నారు.

క్షతగాత్రులకు చికిత్స



మల్లాడి సతీష్ (ఫైల్)

కాకినాడ క్రైం: చొల్లంగిలో ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలైన ముగ్గురు క్షతగాత్రులను గురువారం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఇదే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కాకినాడ ఏటిమొగ ఆంజనేయ స్వామి గుడి వీధికి చెందిన మల్లాడి సతీష్ (35) మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. సతీష్‌కు పదేళ్ల క్రితం లక్ష్మితో వివాహం కాగా, ఏడాదిన్నర పాప ఉంది. ఇతడు స్థానిక లక్ష్మీ డీప్ వాటర్ పోర్టులో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. క్షతగాత్రుల్లో కర్రి ధనరాజును మెరుగైన వైద్యం కోసం కాకినాడ అపోలో ఆస్పత్రికి తరలించగా ఇదే ప్రమాదంలో గాయపడ్డ భైరవపాలేనికి చెందిన క్షతగాత్రులు శ్రీను, కస్తూరిలను వారి బంధువులు కోకిల సెంటర్‌లో ఉన్న బీఆర్ఎం కేర్ వెల్ ఆసుపత్రిలో చేర్చారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి పరామర్శ

చొల్లంగి రోడ్డు ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సతీష్ సహా క్షతగాత్రుడు ధనశేఖర్ కుటుంబాలను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. అపోలో ఆసుపత్రికి వెళ్లి ధనశేఖర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా వైద్యుల్ని కోరారు. ఇదిలా ఉంటే, భైరవపాలెంకు చెందిన యువకులు మార్పీవయ్య, శ్రీనులు డాక్టర్ బీఆర్ఎం కేర్ వెల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. మెదడుపై తీవ్ర గాయం అయిన మార్పీవయ్య అపస్మారక స్థితిలో ఉన్నాడని వెల్లడించారు. ధనశేఖర్ కుటుంబాన్ని మాజీ ఎంఎల్ఏ కొండబాబు పరామర్శించారు.

ఆరోగ్య కేంద్రాల్లో అదనపు వసతులు

- యూపీహెచ్‌సీలలో ప్రత్యేక అధికారుల నియామకం
- కమిషనర్ మహేష్ కుమార్



పీహెచ్‌సీల అభివృద్ధిపై సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్ కుమార్

కాకినాడ: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మరిన్ని మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చెప్పారు. యూపీహెచ్‌సీల పనితీరు మెరుగు పరిచేందుకు నగరంలోని 13 పీహెచ్‌సీలకు 13 మంది ప్రత్యేక అధికారులను నియమిస్తున్నామన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఆస్పత్రుల అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చేరువగా ప్రభుత్వ వైద్య సేవలు అందాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీలను అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నియామకమైన ప్రైమరీ హెల్త్ కేర్ స్పెషల్ ఆఫీసర్లు ప్రతి యూపీహెచ్‌సీని సందర్శించి, వాటి పనితీరును, అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలపై ఆగస్టు మూడో తేదీలోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, పలువురు డీఈలు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

మహోన్నతుడు అబ్దుల్ కలాం



మండల పరిషత్ కార్యాలయంలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న తదితరులు



అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

కాకినాడ రూరల్‌: దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అని డీఎల్ఓ పాటంశెట్టి నారాయణమూర్తి పేర్కొన్నారు. దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని నియోజకవర్గంలో పలు చోట్ల గురువారం ఆయనకు ఘన నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో కలాం విగ్రహానికి డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ కె.స్వప్న, మండల ఇంజినీరు వాసుదేవరావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ నారాయణమూర్తి మాట్లాడుతూ భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి శాస్త్రవేత్తగా ఎన్నో సేవలందించారన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో కలాంకు ప్రిన్సిపాల్ డాక్టరు కమలకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. వాకలపూడిలో గ్రామ పంచాయతీ అధికారి పాండురంగారావు, తదితరులు, రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, సత్యనారాయణ, రాజా తదితరులు నివాళులర్పించారు.

ఎన్ఈపీతో మెరుగైన ఫలితాలు

- కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శేఖర్
- ఘనంగా తృతీయ వార్షికోత్సవం



విద్యార్థిని ప్రదర్శించిన నమూనా పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శేఖర్, డీవైఈఓ ఆర్‌జేడీ రాజు తదితరులు

కాకినాడ రూరల్‌: కేంద్ర విద్యా విధానం (ఎన్ఈపీ) – 2020తో మెరుగైన ఫలితాలు సాధించగలుగుతున్నామని కాకినాడ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బొంతు శేఖర్ పేర్కొన్నారు. ఎన్ఈపీ – 2020 విధానం అమలులోకి వచ్చి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా వలసపాకలలోని కేంద్రీయ విద్యాలయలో గురువారం తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ శేఖర్, డీవైఈఓ ఆర్జేడీ రాజు, ఎంఈఓ ఏసుదాసు, అగస్టస్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మీడియా ప్రిన్సిపాల్ సతీస్ మాట్లాడుతూ కేంద్ర విద్యా విధానం – 2020 ద్వారా 5+3+3+4 విధానంలో బోధన సాగుతోందని అన్నారు. తమ పాఠశాలలో సుమారు 500 మంది చదువుతున్నారన్నారు. సీబీఎస్ఈ సిలబస్ ద్వారా జరిగే బోధనలో కేంద్రీయ విద్యాలయాలతో పాటు గుర్తింపు పొందిన పాఠశాలలు ఉన్నాయన్నారు. డీవైఈఓ ఆర్‌జేడీ రాజు మాట్లాడుతూ కేంద్ర విద్యా విధానం 2020 ద్వారా జాతీయ స్థాయిలో సీబీఎస్ ద్వారా బోధన జరుగుతుందన్నారు. ఫౌండేషన్ నుంచి సెకండరీ స్టేజ్ వరకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్ని అంశాలు బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో అక్షర, ఆశ్రమ పబ్లిక్ స్కూల్, పెద్దాపురం నవోదయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

కాకినాడ: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. గురువారం ఆయన నాలుగో సర్కిల్ పరిధిలోని దుమ్ములపేట, సంజయ్ నగర్, కొండేలుపేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేసి మెరుగైన పనితీరు చూపాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఇందులో భాగంగా దుమ్ములపేట, సంజయ్‌నగర్, మేజర్ డ్రైన్ ఔట్‌లెట్‌ను పరిశీలించి నీటి పారుదల, ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుమ్ములపేట రైల్వేట్రాక్ మేజర్ డ్రైన్ అవుట్‌లెట్‌ను కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లాజర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వర్సిటీ ప్రధాన గ్రంథాలయం వద్ద 1994-98 బ్యాచ్ విద్యార్థుల బృందం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో 1994–98 మధ్య కాలంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు గురువారం సాయంత్రం కళాశాల ఆవణలో ఆత్మీయంగా కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ కలసి తాము కళాశాలలో చదువుకున్న రోజుల్లోని మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తరగతి గదులు సందర్శించి తమకు పాఠాలు బోధించిన ప్రొఫెసర్లను సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తల, మెడ క్యాన్సర్‌లపై అవగాహన

బోట్‌క్లబ్‌: నేడు తల, మెడ క్యాన్సర్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక మెడికవర్ ఆసుపత్రిలో గురువారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ తల, మెడ క్యాన్సర్ అవగాహన కార్యక్రమం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్యాన్సర్ వైద్య నిపుణులు ప్రసోబ్‌కుమార్ క్యాన్సర్లలో రకాలు, లక్షణాలు వివరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య నిపుణులు ప్రసోబ్‌కుమార్‌ను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్, సభ్యులు వీవీ రావు, సిరాజ్, రఘురామ్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఎంపీడీఓ అప్పారావు



కరపలో గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈఈ



ఉప్పలంకలో సచివాలయ నిర్మాణాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

కరప: గ్రామాల్లోని లబ్ధిదారులను చైతన్యపరచి గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు పేర్కొన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పలు సూచనలిచ్చారు. గ్రామాల వారీగా గృహనిర్మాణాలు సకాలంలో పూర్తి చేయించాలన్నారు. మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు వంతున మంజూరైందని, దానికి బిల్లులు చేయాలన్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉన్నాయని తెలిపి, లబ్ధిదారులతో నిర్మాణాలు ప్రారంభింపజేయాలన్నారు. ఇళ్లనిర్మాణాలు చేపట్టేందుకు ముందుకువస్తే రూ.20 వేలు అడ్వాన్స్ పేమెంట్ ఇస్తున్నట్టు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ తెలిపారు. హౌసింగ్ ఏఈఈ సుంకర రాంబాబు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బాగున్న ఇళ్లకు రాష్ట్రప్రభుత్వం అవార్డులు ప్రకటించిందన్నారు. ఇందుకు నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంలో గృహాలు నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను పరిశీలించి, వాటిని వినియోగిస్తున్నారో, లేదో పరిశీలించి రెండు నిమిషాల నిడివితో ఒక వీడియో తీయాలన్నారు. గృహాలలో గృహంలోనే ఒకపక్క నివశిస్తూ, మరోపక్క టైలరింగ్, ఇతర పనులు చేస్తూ స్వయం ఉపాధి కల్పించుకున్న గృహాల వీడియో తీయాలన్నారు. వాటిని పరిశీలించి, మంచి గృహాన్ని ఎంపికచేసి రాష్ట్రస్థాయిలో అవార్డు లభిస్తుందని ఏఈఈ రాంబాబు తెలిపారు.

సచివాలయ, ఆర్‌బీకే భవన నిర్మాణాలు పూర్తిచేయాలి

గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలు నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తయేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ (డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) పాటంశెట్టి నారాయణమూర్తి సూచించారు. మండల పర్యటనలో భాగంగా గురువారం ఉప్పలంకలో జరుగుతున్న భవన నిర్మాణాలను ఆయన పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. భవనాలను ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. తర్వాత ఉప్పలంక గ్రామానికి డ్రై ఫిష్ యూనిట్ మంజూరైందని తెలిపి, దానిని నెలకొల్పేందుకు కమ్యూనిటీ హాలును పరిశీలించారు. ఆ యూనిట్‌లో పనిచేసేందుకు 45 మంది ఎంపిక కాగా, మొదటిబ్యాచ్‌లో 15 మందిని విశాఖపట్టణానికి శిక్షణ నిమిత్తం పంపించినట్టు డీఎల్‌డీఓ తెలిపారు. గ్రామకార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ పాలన

జగనన్న సురక్షలో ద్వారంపూడి



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి

కాకినాడ: ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక 13, 35 డివిజన్ల పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వివిధ ధ్రువ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేక గతంలో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడేవారన్నారు. ఎటువంటి సమస్య లేకుండా స్థానిక సచివాలయాల్లోనే వాటిని పొందే వెసులుబాటును కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ, జనసేన పార్టీలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నాయని, ఆ పార్టీల మాయ మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కూడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణు, మాజీ కార్పొరేటర్లు రోకళ్ల సత్యనారాయణ, బవులూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సురక్షలో 10,626 సర్టిఫికెట్ల అందజేత

కరప: మండల పరిధిలోని 21 గ్రామ సచివాలయాల్లో ఈనెల ఒకటి నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 10,626 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, తాను రెండు బృందాలుగా జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించామని తెలిపారు. కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు జిల్లాలో ముందుగా కరపలో లాంఛనంగా ప్రారంభించారని ఎంపీడీఓ తెలిపారు. 4941 మందికి ఇంటిగ్రేటెట్, 4751 మందికి ఆదాయ, ఏడుగురికి జనన, 8 మందికి మరణ, ఆరుగురికి మ్యూటేషన్, ఏడుగురికి మ్యూటేషన్ కరెక్షన్, 14 మందికి ఫ్యామిలీ మెంబర్, 602 మందికి ఆధార్ సేవలు, 184 మందికి సీసీఆర్‌సీ, 57 మందికి రైస్‌కార్డులు, 49 మందికి హౌస్‌హోల్డ్ వెరసి 10,626 ధృవీకరణ పత్రాలు అందజేసినట్టు ఎంపీడీఓ అప్పారావు వివరించారు.

కూటి కోసం వెళితే కాటికి..

- నిండు ప్రాణాన్ని బలిగొన్న నిర్లక్ష్యం
- 33 కేవీ విద్యుత్‌లైన్‌ను ఆనుకుని రాయుడుపాలెంలో భవన నిర్మాణం
- సెకండ్ ఫ్లోర్‌లో బైండింగ్ వర్కు చేస్తూ ఐరన్ ఊస తీగలపై పడి మేస్త్రి మృతి



ప్రసాద్ పనిచేస్తున్న భవనం.



(అంతర చిత్రం) ప్రసాద్ (ఫైల్)

కాకినాడ రూరల్‌: పొట్ట కూటి కోసం ఎత్తైన భవన నిర్మాణాలలో ప్రమాదపు అంచున పనిచేసే శ్రామిక జీవులు భవన నిర్మాణ కార్మికులు. వారి జీవితాలను పణంగా పెట్టి పనులు చేస్తున్నా.. భవన యజమానులు సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ఎందరో కార్మికులు ప్రమాదాల పాలవుతున్నారు. ఈ కోవలోనే కాకినాడ రూరల్ రమణయ్యపేట పంచాయతీ రాయుడుపాలెంలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. రాయుడుపాలెం నుంచి కొత్తూరు వెళ్లే మార్గంలో నిర్మాణంలో భవనం వద్ద పనిచేస్తున్న సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన బైండింగ్ మేస్త్రి కారుకొండ ప్రసాద్(35) 33 కేవీ విద్యుత్ తీగలకు తన చేతిలోని ఐరన్ ఊచ తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్ తనతో పాటు మరో నలుగురు కార్మికులను తీసుకుని ఉదయమే హుస్సేన్‌పురం నుంచి పనికి వచ్చాడు. రెండో ఫ్లోర్‌లో ఐరన్ ఊచలను కడుతుండగా ప్రసాద్ చేతిలో ఊచ పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు తగలడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలాడు. మొల కింద భాగంలో శరీరం కాలిపోయింది. దీంతో తోటి కూలిలు ఆందోళనకు గురయ్యారు. మృతుడి భార్య నాగరత్నం ఫిర్యాదు మేరకు సర్పవరం ఏఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పీఎంకు తరలించారు. అతనిపై ఆధార పడిన భార్య, ఇద్దరు పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయారు. పోలీసులు మాత్రం ప్రమాదవశాత్తు జరిగినట్టు కేసు నమోదు చేశారు.

సమస్యలు చెప్పుకుంటే నేరమా?

- 'ఈనాడు' తీరు సరికాదు
- గాంధీనగర్ వాసి శ్రీనివాస్

కాకినాడ: కుళాయి సమస్య చెప్పుకుంటే కూడా నేరమేనా? గడపగడపకూ మన ప్రభుత్వం అంటే సమస్యలు విని పరిష్కరించడానికే కదా? అని 41వ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన వై.శ్రీనివాస్ పేర్కొన్నారు. 'పార్టీకి పనిచేశా.. నా సమస్య పరిష్కరించరా' శీర్షికన గురువారం ఈనాడు పత్రికలో గడపగడపకూ మన ప్రభుత్వంలో నిలదీశారంటూ వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు.

2019లో కుళాయి కనెక్షన్ తీసుకున్నానని, అయితే సాంకేతిక కారణాల వల్ల అంతకుముందు నుంచి తనకు కుళాయి చార్జీలు వేశారన్నారు. ఈ విషయాన్ని గడపగడపకు మన ప్రభుత్వంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్తే పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. తాను చెప్పుకున్న సమస్యను ఈనాడు పత్రిక భూతద్దంలో చూపిస్తూ తప్పుపట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నారన్నారు. అనవసర రాద్ధాంతం చేసి ప్రభుత్వంపై ఈనాడు బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

కేంద్ర ప్రభుత్వం రైతు పక్షపాతి

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు

కాకినాడ రూరల్‌: ప్రధాని నరేంద్ర మోదీ 1.25 కోట్ల కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేశారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. అనసూయ ఫెర్టిలైజర్స్ ఇఫ్కో, అగ్రికల్చర్ అధికారులు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పండూరు గ్రామంలో కిసాన్ సమృద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించిన వీర్రాజు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ నాయకత్వంలో రైతు పక్షపాతి ప్రభుత్వం సాగుతోందనడానికి నిదర్శనమే ఈ కేంద్రాలు జాతికి అంకితం చేయడం అన్నారు. అగ్రికల్చర్ ఏడీ పద్మశ్రీ వివిధ పథకాల తోడ్పాటు వివరాలను రైతులకు వివరించారు. మండల బిజెపి నాయకులు నండూరి సత్తిబాబు, నక్క వెంకట్రాజు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరు సూర్యనారాయణరాజు, మీడియా ప్రతినిధి ఎనిమిరెడ్డి మాలకొండయ్య పాల్గొన్నారు.

బయో డీజిల్ విక్రయాలపై కేసు

5,800 లీటర్ల సరుకు సీజ్

కాకినాడ రూరల్‌: ఏడీబీ రోడ్డును ఆనుకుని కాకినాడ రూరల్ వాకలపూడి గ్రామ పరిధిలో భారత్ పెట్రోలియం బంక్ ఎదురుగా అనుమతి లేకుండా బయో డీజిల్ విక్రయాలు జరుపడంతో పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి బయో డీజిల్‌ను తీసుకు వచ్చి అక్రమ నిల్వ ఉంచి బోట్లకు విక్రయాలు జరుపుతున్నట్టు సమాచారం అందడంతో పౌర సరఫరాలు అధికారులు ఏఎస్ఓ ప్రసన్నలక్ష్మిదేవి, ఎంఎస్ఓలు మమత, ఆనంద్, సిబ్బంది బుధవారం దాడి చేసి అర్ధరాత్రి వరకు రికార్డులు తనిఖీ చేశారు. 5,800 లీటర్ల సరుకు సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఓ ప్రసన్న లక్ష్మీదేవి మాట్లాడుతూ వాకలపూడిలోని సీమాన్ లాబొరేటరీస్‌లో జాలీమ్ శామ్రాయ్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా బయోడీజిల్ విక్రయిస్తుండడంతో కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బయో డీజిల్‌ను వశిష్ట ఫ్యూయల్ వద్ద భద్రత నిమిత్తం గురువారం అప్పగించామన్నారు. ట్యాంకర్‌తో ఉన్న వాహనాన్ని తిమ్మాపురం పోలీసులకు అప్పగించామన్నారు. సరకును హైదరాబాద్, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తెచ్చినట్టు నిందితుడు తెలిపాడన్నారు.



శ్రీ పైడ చలమయ్య (శ్రీనివాస కళ్యాణ మండపం)
ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్, డి.నెం.27-4-24,
టెంపుల్ స్ట్రీట్, కాకినాడ- 533001